# పేదల చదువులతో చెలగాటం

- సంస్కరణల పేరుతో యూపీ పాఠశాలల విలీనానికి ప్రతిపాదనలు..
- ఐదు పాఠశాలలు హైస్కూళ్లలో విలీనం
- కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న తల్లిదండ్రులు
- డ్రాపౌట్స్ పెరిగే అవకాశం ఉందని ఆందోళన

పెనుగంచిప్రోలు: ప్రాథమికోన్నత పాఠశాలల విలీనానికి ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేస్తుండటం విద్యార్థుల తల్లిదండ్రుల్లో గుబులు రేపుతోంది. ప్రభుత్వ బడులను అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వం కార్పొరేట్ బడులకు మేలు చేకూర్చేలా నిర్ణయాలు తీసుకుంటుండటంపై మేధావులు పెదవి విరుస్తున్నారు. నూతన విద్యావిధానం పేరుతో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను తగ్గించేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేయడాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు వ్యతిరేకిస్తున్నారు.

### పేద విద్యార్థుల పాలిట శాపం..

ప్రభుత్వం విద్యావ్యవస్థను బలోపేతం పేరుతో కూటమి ప్రభుత్వం పలు కొత్త విధానాలను తీసుకొచ్చింది. అందులో భాగంగా ఫౌండేషన్, బేసిక్, మోడల్ ప్రైమరీ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామని చెబుతోంది. కొత్త విధానంలో ప్రతి పంచాయతీ పరిధిలో ఒక ఆదర్శ పాఠశాలను ఏర్పాటు చేసి ఆపంచాయతీ పరిధిలోని మిగిలిన ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5వ తరగతులను అందులో విలీనం చేయనున్నారు. 60మంది లోపు విద్యార్థులుంటే బేసిక్ ప్రైమరీ పాఠశాలగా, 2వ తరగతి వరకు మిగిలిపోయిన పాఠశాలలను ఫౌండేషన్ పాఠశాలలుగా, 60మంది లోపు విద్యార్థులున్న యూపీ పాఠశాలల్లోని 6,7,8 తరగతులను ఐదు కిలోమీటర్ల లోపు ఉండే హైస్కూల్స్‌లో విలీనం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

### ఇతర గ్రామాలకు వెళ్లాల్సిందే..

మండలంలో మొత్తం 5యూపీ పాఠశాలలు ఉండగా, ఏ పాఠశాలలోనూ 60మంది పైన విద్యార్థులు లేకపోవడంతో పక్క గ్రామాల్లోని


గుమ్మడిదుర్రు యూపీ పాఠశాల

హైస్కూల్స్‌కు తప్పనిసరిగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ముచ్చింతాల యూపీ పాఠశాలను పెనుగంచిప్రోలు బాలికల హైస్కూల్‌లో, లింగగూడెం యూపీ పాఠశాలను పెనుగంచిప్రోలు కెవీఆర్ జెడ్పీ బాలుర హైస్కూల్‌లో, శివాపురం, గుమ్మడిదుర్రు యూపీ పాఠశాలలను అనిగండ్లపాడు హైస్కూల్‌లో, తోటచర్ల యూపీ పాఠశాలను కొల్లికూళ్ల జెడ్పీ స్కూల్‌లో విలీనం చేయనున్నారు. గుమ్మడిదుర్రు నుంచి అనిగండ్లపాడు హైస్కూల్‌కు ఐదున్నర కిలోమీటర్ల దూరం ఉంది. ప్రతి యూపీ పాఠశాల నుంచి 2నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో హైస్కూళ్లు ఉన్నాయి. గ్రామంలో స్కూల్ ఉండటంతో విద్యార్థినీ విద్యార్థులకు వెసులుబాటు ఉందని, ఇలా నూతన విద్యావిధానం పేరుతో రెండు నుంచి ఐదు కిలోమీటర్ల దూరం ప్రతిరోజూ విద్యార్థులు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడతారంటూ తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలలకు బాలికలను ఎలా పంపించాలని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. తద్వారా డాపౌట్స్ పెరిగే అవకాశం ఉందని విద్యావేత్తలు చెబుతున్నారు.

### 'ప్రైవేట్'కు మేలు కోసమేనా?..

నూతన విద్యావిధానంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని విద్యాశాఖ అధికారులు చెబుతుండగా, ఈవిధానం ముఖ్యంగా గ్రామాల్లోని ప్రైవేట్ స్కూళ్లకు లాభం చేకూర్చేదిగా ఉందని తల్లిదండ్రులు అనుమానిస్తున్నారు.

3,4,5వ తరగతులను విలీనం చేయడం ద్వారా ప్రతి సబ్జెక్టుకు ప్రత్యేకంగా ఒక టీచర్ బోధించే అవకాశం ఉంటుందని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. యూపీ పాఠశాల నుంచి పక్క గ్రామాల్లోని హైస్కూల్స్‌కు వెళ్లే విద్యార్థులకు ట్రావెలింగ్ అలవెన్స్ కూడా ఇస్తామని ప్రభుత్వం చెబుతుండగా, ఏడాదిగా 'తల్లికి వందనం' పథకానికే దిక్కు లేదుగాని ఇక కొత్త పథకాలకు అవకాశమెక్కడ అని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి నూతన విద్యా విధానం పేరుతో యూపీ పాఠశాలల విలీన ప్రక్రియను విరమించుకోవాలని విద్యావేత్తలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

### పాఠశాలల విలీనం సరైనది కాదు..



పాఠశాలల విలీనం ప్రక్రియ సరైనది కాదు. మాగ్రామంలోని యూపీ పాఠశాలలో 6,7,8వ తరగతుల విద్యార్థులు 40మంది వరకు ఉన్నారు. గ్రామం నుంచి అనిగండ్లపాడు పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులకు చాలా ఇబ్బందులు ఉన్నాయి. ముఖ్యంగా బాలికలను పంపేందుకు తల్లిదండ్రులు అయిష్టంగా ఉన్నారు.

– చిర్రా తిరుపతిరావు, విద్యార్థిని తండ్రి, గుమ్మడిదుర్రు

### పునరాలోచించాలి..



మాగ్రామంలోని యూపీ పాఠశాలలోని 6,7,8 తరగతులను పెనుగంచిప్రోలు బాలికల హైస్కూల్‌కు విలీనం చేస్తున్నామని చెబుతున్నారు. ఇలా చేస్తే విద్యార్థులు డ్రాపౌట్స్ పెరిగే అవకాశం ఉంది. చిన్నపిల్లలకు కష్టంగా ఉంటుంది. విలీన ప్రక్రియపై పునరాలోచించాలి.

– గుజ్జర్లపూడి వెంకటేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్, ముచ్చింతాల యూపీ పాఠశాల

### స్కూల్‌కు వెళ్లాలంటే దూరం..



మా గ్రామం నుంచి అనిగండ్లపాడు హైస్కూల్‌కు వెళ్లాలంటే ఐదున్నర కిలోమీటర్లు ఉంది. ఇది చాలా కష్టం. బస్సు సౌకర్యం కూడా లేదు. పాఠశాలకు వెళ్లి రావాలంటే ఇబ్బందులు తప్పేలా లేవు. ఇలా అయితే మా చదువులు సాగేది ఎలా?

–తిరుపతమ్మ, 8వ తరగతి విద్యార్థిని, గుమ్మడిదుర్రు

## క్లుప్తంగా

### వైభవంగా శ్రీరామకోటి మహోత్సవాలు



నందిగామటౌన్(నందిగామ రూరల్): పట్టణంలోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న 72వ శ్రీరామకోటి మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపంలో సువర్చల సహిత ఆంజనేయస్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు దంపతులు పీటలపై కూర్చుని కల్యాణాన్ని జరిపించారు.ఈసందర్భంగా నిర్వహించిన ఆధ్యాత్మిక ధార్మిక భక్తి కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీతారామనామ సంకీర్తనా సంఘ సభ్యులు, అర్చకులు దివి రత్నమాచార్యులు, అధోక్షజాచార్యులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### నేడు కుట్టు మిషన్లు పంపిణీ

కంచికచర్ల: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శిక్షణ పొందిన మహిళలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కుట్టుమిషన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి తెలిపారు. ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఎంపీడీఓ కోరారు.

### రామారావుకు సత్కారం



పెనుగంచిప్రోలు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావును శుక్రవారం బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వేముల బేబిరాణి ఆయన నివాసంలో కలిశారు. ఈసందర్భంగా రామారావును ఆమె దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో విశ్రాంత ఏఎస్ఐ బత్తుల నాగేశ్వరరావు, మండల బీసీసెల్ అధ్యక్షులు బత్తుల శ్రీనివాసరావు, నాయకులు దేరంగుల శ్రీనివాసరావు, ఎన్ వెంకటేష్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

### 'గురుకులం' ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చందర్లపాడు(నందిగామ రూరల్): చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులం పాఠశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఐదోతరగతిలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రేమావతి శుక్రవారం తెలిపారు. దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 13వతేదీతో ముగుస్తుందని, ఏప్రిల్ 6వతేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు. ఈనెల 13వతేదీ లోగా సమీపంలోని గురుకులం విద్యాలయాలు, ఇంటర్‌నెట్ సెంటర్లలో సంప్రదించి ఆన్‌లైన్ విధానం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### సామినేని విశ్వనాథంకు నివాళి



జగ్గయ్యపేట అర్బన్: మాజీ సర్పంచ్, సీనియర్ రాజకీయవేత్త సర్దార్ సామినేని విశ్వనాథం 9వ వర్ధంతిని శ్రీకృష్ణదేవ రాయ సేవాసమితి, వంగవీటి మోహనరంగా సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న విగ్రహానికి అభిమానులు పూలమాలలువేసి నివాళులర్పించారు. బస్టాండ్ వద్ద ప్రయాణికులు, ఆటో కార్మికులకు మజ్జిగ, లస్సీ పాకెట్లను పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ వట్టెం మనోహర్, న్యాయవాది పసుపులేటి సత్యశ్రీనివాసరావు, సేవాసమితుల ప్రతినిధులు పాల్గొన్నారు.

### హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ

నందిగామటౌన్(నందిగామ రూరల్): ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ అభిమన్యు, ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ సూచించారు. పట్టణంలోని రైతుపేట సెంటర్‌లో హెల్మెట్ ధారణపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం మంది తలకు గాయాలై మృతి చెందుతున్నారని గణాంకాలు చెబుతున్నాయన్నారు. హెల్మెట్ ధరించకపోవడమే ఇందుకు ప్రధాన కారణమన్నారు. వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నామని వాహనదారులు కూడా ఈ విషయాన్ని అర్థం చేయాలని కోరారు. ర్యాలీలో ట్రాఫిక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### 110 మందికి వైద్యపరీక్షలు

చందర్లపాడు(నందిగామ రూరల్):గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మార్కపూడి వెంకట్రావమ్మ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వాసిరెడ్డి ప్రసాద్ సూచించారు. సాగర్ మల్టీస్పెషాలిటీ క్లినిక్ ఆధ్వర్యంలో చందర్లపాడు మండలం కోనాయపాలెం పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా సకాలంలో వ్యాధి నిర్ధారణ జరిగి, వైద్య సేవలు పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ శిబిరంలో వైద్యులు లక్ష్మీప్రియ, పవన్‌కుమార్ పాల్గొని మొత్తం 110 మంది గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మార్కపూడి జాన్‌కోటయ్య, కొత్తా కామేశ్వరరావు, ఉలవలపూడి నతానియేలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్రామస్తులు సహకరించాలి : ఏసీపీ

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): శ్రీతిరుపతమ్మ అమ్మవారి చిన్నతిరునాళ్లలో ప్రధాన ఘట్టమైన అమ్మవారి పుట్టినిల్లు అనిగండ్లపాడు నుంచి మార్చి 17వతేదీన పెనుగంచిప్రోలు వచ్చే పసుపు–కుంకుమ బండ్ల రాకకు గ్రామస్తులంతా సహకరించాలని నందిగామ ఏసీపీ తిలక్ కోరారు. 'పసుపు–కుంకుమ బండ్లు' కార్యక్రమానికి సంబంధించి స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ వద్ద శుక్రవారం ఆయన గ్రామస్తులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏసీపీ తిలక్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఏటా మాదిరిగా గ్రామస్తులంతా పార్టీలకతీతంగా సహకరించాలన్నారు. ఆచార, సంప్రదాయాలను గౌరవిస్తూ ఉత్సవంలో ఎక్కడా పార్టీ జెండాలు, పాటలు, రెచ్చగొట్టే మాటలు లేకుండా వ్యవహరించాలని సూచించారు. ఆలయ ఈఈ ఎల్.రమ మాట్లాడుతూ భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. గ్రామస్తులు మాట్లాడుతూ అమ్మవారి బండి వెనుక గ్రామంలో ఒప్పందం ప్రకారం ఈఏడాది టీడీపీ బండ్లు, తరువాత వైఎస్సార్‌సీపీ బండ్లు వస్తాయన్నారు. తిరునాళ్లకు పెనుగంచిప్రోలుతోపాటు అనిగండ్లపాడు గ్రామానికి భక్తులు పెద్దసంఖ్యలో వస్తారని, పారిశుద్ధ్య నిర్వహణకు ఆలయం వారు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.శ్రీను, జగ్గయ్యపేట సీఐ పి.వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, ఆలయ మాజీ చైర్మన్లు నెల్లూరి గోపాలరావు, అత్తలూరి అచ్యుతరావు, వైఎస్సార్ సీపీ గ్రామాధ్యక్షుడు యానాల సురేష్, సొసైటీ మాజీ అధ్యక్షుడు పిడికిటి కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య, మండల కోఆప్షన్ సభ్యులు జాన్‌మియా, డీటీ భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గంగూరి ప్రసాద్, ఉన్నం శ్రీనివాసరావు, వూట్ల లక్ష్మయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏసీపీ తిలక్, పక్కన ఈఈ రమ, ఎంపీడీఓ శ్రీను తదితరులు

## పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి : సీపీఐ

జగ్గయ్యపేటఅర్బన్: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని నిరుపేదలకు ఇళ్లస్థలాలను మంజూరు చేస్తామన్న హామీని వెంటనే అమలుచేయాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ(సీపీఐ) ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. స్థానిక కోదాడ రోడ్‌లోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం సీపీఐ జగ్గయ్యపేట నియోజకవర్గ సమితి సమావేశం జరిగింది. సమావేశానికి ఆ పార్టీ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కె.బాబురావు అధ్యక్షత వహించగా దోనేపూడి శంకర్ మాట్లాడుతూ గత మంత్రివర్గ సమావేశంలో నిరుపేదల ఇళ్ల స్థలాల కోసం తీర్మానాలు చేసి నెలలు గడుస్తున్నప్పటికీ నేటివరకు వాటిని అమలు చేయలేదని విమర్శించారు. పట్టణ ప్రాంతంలోని పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు స్థలంతో పాటు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఇళ్లస్థలాల పంపిణీ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15వతేదీన స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట అర్జీదారులతో కలిసి ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో నియోజకవర్గంలోని ఇళ్లస్థలాల అర్జీదారులతోపాటు దేవదాయ భూముల బాధితులంతా పాల్గొనాలని కోరారు. జగ్గయ్యపేట నుంచి సీపీఐ తరపున ఎమ్మెల్యేగా పనిచేసిన పిల్లలమర్రి వెంకటేశ్వర్లు కాంస్య విగ్రహాన్ని డిపో సెంటర్‌లోని పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేయాలని నిర్ణయిస్తూ తీర్మానం చేసినట్లు వివరించారు. ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజీ, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి పోతిపాక వెంకటేశ్వర్లు, పట్టణ సహాయ కార్యదర్శులు మాశెట్టి రమేష్, ఎం.అసదుల్లా, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కరిసె మధు, సీనియర్ నాయకులు భోగ్యం నాగులు, వత్సవాయి మండల కార్యదర్శి షేక్ జానీ, మెటికల శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్

### ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

ఇబ్రహీంపట్నం: నిత్యం ధ్యానం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ సీతఈఓ శ్రీదేవి అన్నారు. ఇబ్రహీంపట్నం ఐశ్వర్య అపార్ట్‌మెంట్‌లో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ, స్పిరిచ్యువల్ టాబ్లెట్స్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ధ్యాన శిబిరంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ధ్యానం, జ్ఞానం ఆవశ్యతను వివరించారు.

### నేడు మహిళా దినోత్సవం

నందిగామ టౌన్(నందిగామ రూరల్): స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు మహిళా దినోత్సవ కేక్ కటింగ్ తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమానికి పార్టీ మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, ఆయా కార్పొరేషన్ల మాజీ చైర్మన్‌లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

**జగ్గయ్యపేటలో..**

జగ్గయ్యపేటఅర్బన్: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు వట్టెం మనోహర్ తెలిపారు. పార్టీ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయారంగాల్లో విశిష్ట సేవలందించిన మహిళలను సత్కరించనున్నట్లు వివరించారు. నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

## పీ4 సర్వేపై సచివాలయ సిబ్బందికి శిక్షణ

నందిగామటౌన్(నందిగామ రూరల్): పట్టణంలోని ప్రతి ఇంటిని సర్వే చేసి జనాభా వివరాలు, ఆర్థిక స్థితిగతులను అంచనా వేసి ప్రభుత్వం ప్రైవేట్ రంగాల ద్వారా ప్రజలకు మెరుగైన సహాయాన్ని అందించే ప్రక్రియను వివరించాలని జిల్లా గణాంక అధికారి ప్రసాద్ సూచించారు. స్థానిక బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో పీ4 సర్వేలో పాల్గొనే సచివాలయ సిబ్బందికి శుక్రవారం శిక్షణ నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వేతో ప్రభుత్వ పథకాలు పొందే లబ్దిదారులపై ఎటువంటి ప్రబావం పడదన్నారు. సర్వే చేసే సిబ్బంది ప్రతి ఇంటికి వివరాలు నమోదు చేసుకోవడంతోపాటు సర్వేను నిస్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణబాబు, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సత్యవతి, సిబ్బంది పాల్గొన్నారు.

**వీరులపాడు మండలంలో..**

వీరులపాడు: పీ4 సర్వేలో పాల్గొనే సిబ్బంది నిస్పక్షపాతంగా వ్యవహరించాలని డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు ఆదేశించారు. మండలంలోని జుజ్జూరు జెల్లి ఏసోబు కల్యాణ మండపంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలకు సర్వేపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల ఎనిమిది నుంచి 18వ తేదీ వరకు గ్రామాల్లో పీ4 సర్వే జరుగుతుందన్నారు. సర్వే చేసే సిబ్బంది గ్రామాల్లోని ఆయా కుటుంబంలోని వారి వివరాలు, ఆర్థిక స్థితిగతులు, చేసే వృత్తుల వివరాలను నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ సంధ్య, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా గణాంకాధికారి ప్రసాద్

### ఘనంగా కొండూరు పాఠశాల స్వర్ణోత్సవం



నందిగామరూరల్: మండలంలోని కొండూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల స్వర్ణోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) మాట్లాడుతూ పాఠశాల ప్రారంభమై 50ఏళ్లు పూర్తి చేసుకోవటం గర్వించదగ్గ విషయమన్నారు. గ్రామానికి చెందిన లగడపాటి ముక్కంటయ్య, తోట రామయ్య స్థల వితరణతో 1973లో పశువుల పాకలో ప్రారంభమైన పాఠశాల దినదినాభివృద్ధి చెందడం హర్షనీయమన్నారు. ఈ పాఠశాలలో విద్యనభ్యసించిన ఎంతోమంది విద్యార్థులు ఆయారంగాల్లో ఉన్నత స్థాయిలో ఉన్నారని గుర్తు చేశారు. స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన ఆయా పోటీల విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ కొర్రపాటి అచ్చారావు, ఎంపీటీసీ సభ్యుడు అప్పికట్ల సురేష్, మాజీ సర్పంచ్ తోట నాగమల్లేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయుడు షేక్ నాగుల్‌మీరా, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న విద్యార్థినుల ప్రదర్శనలు

నందిగామటౌన్(నందిగామ రూరల్): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి చేరాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి సూచించారు. పట్టణంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం రాత్రి ఫేర్‌వెల్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణకుమారి మాట్లాడుతూ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మున్సిపల్ కమిషనర్ రమణబాబు, నాయకులు మండవ పిచ్చయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళా ఉద్యోగులకు సత్కారం

గండ్రాయి(జగ్గయ్యపేట): గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాలలో మహిళా టీచర్లు, గ్రామ సచివాలయం, భూచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మహిళా ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నేలవెల్లి రమేష్‌బాబు, సీహెచ్‌వో నాగలక్ష్మి, ఉపాధ్యాయులు రమాదేవి, పద్మావతి, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

**జగ్గయ్యపేట పట్టణంలో..**

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక విజ్ఞాన్ హైస్కూల్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి ఆధ్వర్యంలో 40మంది మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

**మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి**

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తుండటం అభినందనీయమని ఐసీడీఎస్ ఏసీడీపీఓ నాగమణి అన్నారు. స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయా రంగాల్లో ప్రతిభ చూపిన ఇద్దరు మహిళలను శుక్రవారం ఘనంగా సత్కరించారు. సీఏ పరీక్షల్లో 45వ ర్యాంకు సాధించిన పెనుగంచిప్రోలు మండలం ముండ్లపాడు గ్రామానికి చెందిన కూచి నాగిని, ఈత పోటీల్లో పతకాలు సాధించిన జగ్గయ్యపేటకు చెందిన రమాదేవిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఉషారాణి, జ్వాలా రజని, భాగ్యలక్ష్మి, బీబీజాన్, శారద, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


గండ్రాయిలో మహిళా ఉద్యోగులను సత్కరిస్తున్న టీచర్లు


మహిళా టీచర్లతో స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి


నాగిని, రమాదేవిలను సత్కరిస్తున్న చిల్లకల్లు ఐసీడీఎస్ ఏసీడీపీఓ నాగమణి తదితరులు

- రూ.13.06 లక్షల ఆదాయం

పెనుగంచిప్రోలు:శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా రూ.13.06 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ కిషోర్‌కుమార్ తెలిపారు.చిన్నతిరునాళ్లలో ఎగ్జిబిషన్ నిర్వహణ హక్కులు రూ.11లక్షలు పలుకగా కొలువేలం ద్వారా రూ.2.06 లక్షల ఆదాయం వచ్చినట్లు వివరించారు. ఏఈవోలు పాల్గొన్నారు.

ప్రకటన